కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited



# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited



సంపుటి - 01 సంచిక -233 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 03-09-2026 గురువారం పేజీలు : 4


# జీఎస్టీ వసూళ్లలో హైదరాబాద్ హవా!




- జీఎస్టీ వసూళ్లలో హైదరాబాద్ హవా
- ఆగస్టులో 91.1 శాతం వాటా
- నగరం నుంచి రూ.3,956 కోట్లు
- ఏడాదిలో 20.53 శాతం వృద్ధి
- 69 శాతం పన్ను చెల్లింపుదారులు నగరంలోనే
- ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్ జోరు
- రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.4,341 కోట్లు
- ఐదు నెలల్లో రూ.5,159 కోట్ల అదనపు ఆదాయం
- జీఎస్టీ-వ్యాట్‌తో రూ.7,534 కోట్ల రాబడి

**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణ వాణిజ్య పన్నుల ఆదాయంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలో నమోదైన జీఎస్టీ పన్ను చెల్లింపుదారుల్లో సుమారు 69 శాతం మంది హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఆగస్టు నెలలో రాష్ట్ర మొత్తం జీఎస్టీ వసూళ్లలో నగరం ఏకంగా 91.1 శాతం వాటాను నమోదు చేసింది. హైదరాబాద్‌లో ఆగస్టు జీఎస్టీ వసూళ్లు గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 20.53 శాతం పెరిగి రూ.3,956 కోట్లకు చేరాయి. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ గణాంకాల ప్రకారం తెలంగాణలో సుమారు 5.8 లక్షల మంది జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు నమోదై ఉన్నారు. వీరిలో దాదాపు 4 లక్షల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారు. అంటే రాష్ట్రంలోని ప్రతి 10 మంది నమోదిత జీఎస్టీ చెల్లింపుదారుల్లో ఏడుగురు నగరానికి చెందినవారే..


మిగతాది 2 లో..


# కాంగ్రెస్ పాలనపై కవిత ధ్వజం!

- 1000 రోజుల పాలనపై కవిత ఫైర్
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- ప్రజా వ్యతిరేక పాలన అంటూ విమర్శలు
- హైడ్రాపై తీవ్రస్థాయిలో ధ్వజం
- నిరుద్యోగుల ఆత్మహత్యలే ప్రగతా?
- మళ్లీ టీఆర్ఎస్ సర్కారే: కవిత




**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ 1000 రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా వ్యతిరేక విధానాలతోనే సాగిందని, ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోయిందని టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# నేపాల్‌లో జలప్రళయం..
## 1,127 మంది మృతి




**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** హిమాలయ దేశం నేపాల్‌ను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేశాయి. విలయతాండవం సృష్టించిన ఈ జలప్రళయంలో మరణించిన వారి సంఖ్య బుధవారం నాటికి ఏకంగా 1,127కు పెరిగినట్లు నేపాల్ పోలీస్ విభాగం అధికారికంగా ప్రకటించింది.

# ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం!




- భారీ వర్షాలకు ఏడుగురు మృతి
- 172 రహదారులు మూత
- ప్రమాదకర స్థాయిలో నదుల ప్రవాహం
- వరదల్లో తల్లి, చిన్నారి మృతి
- ఇళ్లపై విరిగిపడ్డ కొండచరియలు
- నేపాలీ కార్మికులు ఇద్దరు మృతి
- పలు ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవులు

# రాజధాని పనులకు జోష్!

- రూ.596 కోట్ల ప్రతిపాదనకు ఆమోదం!
- గ్రామాల్లో వసతులకు రూ.533 కోట్లు
- సీసీ రోడ్లకు బదులు బీటీ రోడ్లు
- మంగళగిరికి అమరావతి తాగునీరు
- డిస్ట్రిక్ట్ కూలింగ్‌పై మాస్టర్‌ప్లాన్
- 42 ఎకరాల అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్?
- మున్సిపల్ ఎన్నికలపై కేబినెట్ చర్చ




**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం నేడు రోజు జరగనుంది. ఈ భేటీలో రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి సీఆర్డీఏ ప్రతిపాదనలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు రూ.596 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనకు ఆమోదం లభించే అవకాశం ఉంది.

రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు మరో రూ.533 కోట్లు కేటాయించాలన్న ప్రతిపాదనపైనా చర్చ జరగనుంది. దరైతుల ప్లాట్లలోని చిన్న రహదారులకు సీసీ రోడ్లకు బదులుగా బీటీ రోడ్లు నిర్మించేందుకు సీఆర్డీఏ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

# పవన్ 'జై కొట్టు'.. యువతకు పిలుపు!




- జనసేన యువజన విభాగం ఆవిష్కరణ
- పార్టీల కోసం కాదు.. మార్పు కోసం నినాదం
- యువతే రాజకీయ, సామాజిక మార్పుకు చోదకశక్తి
- 'దేశం కోసం పని చేసే చేతులు కావాలి'
- సేవాభావం, స్వావలంబన పెంచుకోవాలన్న పవన్
- ప్రజల కోసం పోరాడే సేనకు జై కొట్టాలి
- పిఠాపురంలో ఘనంగా 'జై కొట్టు' ఆవిష్కరణ

# రేవంత్‌కు సురేఖ షాక్!

- చర్యలు ఉంటే సీఎంపైనే ముందు!
- 'పదేళ్లు నేనే సీఎం'పై ప్రశ్నలు
- టికెట్లు ప్రకటించే హక్కు సీఎంకుందా?
- అభ్యర్థుల ప్రకటనపై నిలదీత
- సీఎం వ్యాఖ్యలే రెచ్చగొట్టాయన్న సురేఖ
- ఢిల్లీ వేదికగా సురేఖ సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమను రెచ్చగొట్టినందుకే తన కూతురు సీఎంపై విమర్శలు చేసిందని, మహిళలు స్వతంత్రంగా బతకాలని రాహుల్ గాంధీ స్పష్టంగా చెబుతున్నారని గుర్తుచేశారు. తన కూతురు మాట్లాడిన మాటలకు తనపై చర్యలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేసిన సురేఖ, ఒకవేళ చర్యలు తీసుకోవాలనుకుంటే ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనే తీసుకోవాలని సంచలన డిమాండ్ చేశారు. 'పదేళ్ల పాటు నేనే సీఎం' అని రేవంత్ రెడ్డి ప్రకటనలు చేయడం పార్టీ క్రమశిక్షణా రాహిత్యం కిందకురాదా అని ఆమె నిలదీశారు.

తదుపరి ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఎవరికి దక్కుతుందనేది నిర్ణయించడానికి సీఎంకు ఏం హక్కు ఉందని సురేఖ ప్రశ్నించారు. బహిరంగ వేదికలపై సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థుల పేర్లను ఎలా ప్రకటిస్తారని, దానికి ఆయనకు ఎవరు అధికారం ఇచ్చారని నిలదీశారు. అధిష్టానం నిర్ణయించాల్సిన టికెట్ల వ్యవహారాన్ని రేవంత్ రెడ్డి ముందే తేల్చడం వల్లనే సమస్యలు వస్తున్నాయని, ఆయన వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉండటం వల్లే తన కూతురు స్పందించాల్సి వచ్చిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విమర్శలు, సీఎం ఏకపక్ష నిర్ణయాలపై ఢిల్లీ వేదికగా కొండా సురేఖ చేసిన ఈ తీవ్ర వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయంలో కాకరేపుతున్నాయి.

# రేషన్ బియ్యానికి గడువు పెంపు!

- లబ్ధిదారులకు మరో ఐదు రోజుల అవకాశం
- సెప్టెంబర్ 5 వరకు కొనసాగనున్న పంపిణీ
- రేషన్ దుకాణాల వద్ద రద్దీతో గడువు పెంపు
- రాఖీ సెలవులతో చాలామందికి అందని సరుకులు
- మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ
- అర్హులంతా గడువులోగా బియ్యం తీసుకోవాలి
- లబ్ధిదారులు నష్టపోకూడదనే కీలక నిర్ణయం


2 లో


# కాళేశ్వరంపై కక్ష.. రైతుపై శిక్ష!

- రైతులకు నీళ్లివ్వరా?
- సాగునీటి రంగంలో కాంగ్రెస్ విఫలం
- కొత్త డ్యామ్ ఒక్కటీ కట్టలేదు
- ప్రాజెక్టుల వైఫల్యాలపై కేటీఆర్ ఫైర్
- తెలంగాణ నీళ్లపై రాజీ ఎందుకు?
- బనకచర్లపై ప్రభుత్వం మౌనం
- చంద్రబాబుకు అనుకూలంగా రేవంత్: కేటీఆర్




**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ముఖ్యంగా సాగునీటి రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రిటైర్డ్ ఇంజినీర్లు, సర్వీస్‌లో ఉన్న ఇంజినీర్లు కూడా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారని తెలిపారు.

# ఆరోగ్యశాఖలో జాబ్స్ జాతర!

- 1,931 పోస్టులకు ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్
- 1:1.25 నిష్పత్తిలో అభ్యర్థుల షార్ట్‌లిస్ట్
- సెప్టెంబర్ 16 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్
- వెంగల్‌రావ్‌నగర్‌లో ధ్రువపత్రాల పరిశీలన
- సెప్టెంబర్ 28న రిజర్వ్ డే
- వెరిఫికేషన్ తర్వాత ఫైనల్ మెరిట్ లిస్ట్
- ఆరోగ్యశాఖలో రెండున్నరేళ్లలో 15 వేల పోస్టులు
- 1,931 నియామకాలతో తుది దశకు ప్రక్రియ


2 లో


# హైదరాబాద్‌లో పోస్టర్ల కలకలం!

- 1000 రోజుల పాలనపై ఏఐ చిత్రాలతో సెటైర్లు
- అసెంబ్లీ నుంచి గాంధీభవన్ వరకు పోస్టర్ల కలకలం
- రేవంత్ రెడ్డి ఏఐ చిత్రాలతో తీవ్ర విమర్శలు
- రూపాయి నోట్ల మూటతో సీఎం చిత్రం వైరల్
- ప్రజల ఆవేదనను చూపిస్తూ వ్యంగ్య పోస్టర్లు
- పోస్టర్లపై కాంగ్రెస్ శ్రేణుల తీవ్ర ఆగ్రహం
- అర్ధరాత్రి అతికింపు.. ఉదయాన్నే తొలగింపు


2 లో

# నేపాల్‌లో జలప్రళయం.. 1,127 మంది మృతి

**మొదటి పేజీ తరువాయి**

భారీ వర్షాలు, వరదలు సంభవించి వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఇంకా వేలాది మంది ఆచూకీ గల్లంతు కావడంతో సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ప్రతికూల వాతావరణం, కొండచరియలు విరిగి పడుతున్న క్లిష్ట పరిస్థితుల్లో సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ దళాలు నిరంతరాయంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతుండగా పెద్ద సంఖ్యలో మృతదేహాలు వెలుగుచూస్తున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాలను వెలికితీయగా, నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మృతదేహాలు లభ్యమయ్యాయి. అలాగే గోర్ఖాలో 66, ధాడింగ్‌లో 59, రసువాలో 45, తనాహు జిల్లాలో 38 మృతదేహాలను సహాయక బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా వందలాది మంది జాడ తెలియకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద బాధితులకు ఆహారం, రక్షిత తాగునీరు, అత్యవసర వైద్య సాయం అందించేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది.

# కాంగ్రెస్ పాలనపై కవిత ధ్వజం!

**మొదటి పేజీ తరువాయి**

ఈ వెయ్యి రోజుల వ్యవధిలో కాంగ్రెస్ పార్టీ ఒక్కరి పొట్ట నింపింది గానీ, పేదల బతుకులను బాగు చేసింది గానీ లేదని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విమర్శలు గుప్పించారు. హైడ్రా పేరిట పేదల ఇండ్ల కూల్చివేతలు, సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల వరుస మరణాలు, నోటిఫికేషన్లు రాక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు, అన్నదాతల బలవన్మరణాలతో పాటు రాష్ట్రంలో రోజురోజుకూ పెరిగిపోతున్న హత్యలు, నేరాలే రేవంత్ రెడ్డి సర్కార్ సాధించిన అసలైన ప్రగతి అని ఆమె ఎద్దేవా చేశారు.

అలాగే ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఈ ప్రభుత్వానికి కాలం చెల్లిపోయిందని కవిత హెచ్చరించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో ఏర్పాటయ్యేది టీఆర్ఎస్ సర్కారేనని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను, ప్రజా వ్యతిరేక ఆగడాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సాగనివ్వబోమని, ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ట్వీట్ ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# రాజధాని పనులకు జోష్!

**మొదటి పేజీ తరువాయి**

మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్‌కు అమరావతిలోని స్టోరేజ్ ట్యాంకుల నుంచి తాగునీరు అందించే ప్రతిపాదనపైనా నిర్ణయం తీసుకునే అవకాశముంది. అలాగే డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటుకు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై మంత్రివర్గం చర్చించనుంది.

రాజధానిలోని వివిధ గ్రామాల్లో 42 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థల ద్వారా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన కూడా కేబినెట్ ముందుకు రానుంది. తాడికొండ, కంతేరు గ్రామాల్లో ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ కోసం అవసరమైన భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించే అవకాశం ఉంది. ఇక, కేబినెట్ అజెండా అనంతరం రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులతో చర్చించనున్నట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన తాజా పరిస్థితులు, సుప్రీంకోర్టు ప్రక్రియ తదితర అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై మంత్రులకు సీఎం కీలక సూచనలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం!



**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** ఉత్తరాఖండ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడటం, వరదలు లాంటి ఘటనల్లో ఏడుగురు మృతి చెందారు. కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రంలోని 172కు పైగా రహదారులు మూతపడ్డాయి. రహదారులు సైతం మూతపడటంతో అంబులెన్స్ లు, ఇతర వాహనాలు భారీగా నిలిచిపోయాయి. రాష్ట్రంలోని గౌలా, కోసి, బిన్, క్షిపా నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

ప్రాజెక్టుల్లోకి సైతం భారీగా వరద నీరు చేరింది. పౌడీ జిల్లా కోట్ ద్వార్ సమీపంలో కొల్హు నదిని దాటుతూ తల్లి, ఏడాదిన్నర చిన్నారి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించారు. అదే విధంగా అల్మోరా జిల్లా ఉదయ్ ఉడా గ్రామంలో ఇళ్లపై కొండచరియలు విరిగిపడటంతో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి మరణించారు. ధార్ ప్రాంతంలో ఇద్దరు నేపాలీ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించారు.

# పవన్ 'జై కొట్టు'.. యువతకు పిలుపు!




**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ యువజన విభాగాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్, రాష్ట్ర ఆహార అండ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ 'జై కొట్టు' పేరుతో యువజన విభాగం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'జై కొట్టు' గేయాన్ని కూడా విడుదల చేశారు.

యువజన విభాగం ఆవిర్భావాన్ని పురస్కరించుకుని జనసేనాని పవన్ కళ్యాణ్ ఆడియో సందేశాన్ని పంపించారు. యువత రాజకీయ, సామాజిక మార్పులో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కేవలం నాయకులు, రాజకీయ పార్టీల కోసం నినాదాలు చేయడం కాకుండా.. సమాజం, యువత భవిష్యత్తు, మార్పు కోసం పనిచేసే దిశగా ముందుకు సాగాలని సూచించారు. 'దేహి అని దేనికోసం చేతులు చాపవద్దు.. దేశం కోసం పని చేసే చేతులు కావాలి' అంటూ యువతలో సేవాభావం, స్వావలంబన పెరగాలని ఆకాంక్షించారు. 'నేను ఎక్కడ ఉన్నాను అని ప్రశ్నార్థకం వద్దు.. ఇక్కడే ఉన్నాను అని అస్తిత్వం పిడికిలి కావాలి' అని పేర్కొన్నారు.

ఇన్నాళ్లూ నాయకులు, రాజకీయ పార్టీల కోసం నినాదాలు చేశామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇకపై యువత కోసం, వారి భవిత కోసం, మార్పు కోసం, ప్రజల తీర్పు కోసం 'జై కొట్టు' అని నినదించాలని పిలుపునిచ్చారు. పట్టు వదలని ప్రజల కోసం పోరాడే సేనకు జై కొట్టాలని, సమాజంలో మార్పు కోసం యువత ముందుండాలని ఆకాంక్షించారు. యువతలో రాజకీయ చైతన్యంతో పాటు బాధ్యత, సేవా దృక్పథం పెంపొందించాలని తన సందేశం ద్వారా స్పష్టం చేశారు.

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన శ్రేణులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'జై కొట్టు' లోగో, గేయం ఆవిష్కరణతో పార్టీ యువజన విభాగానికి అధికారికంగా కొత్త రూపం లభించింది. యువతను మరింతగా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై స్పందించేలా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా 'జై కొట్టు'ను ఉపయోగించుకోవాలని జనసేన భావిస్తోంది.

# రేషన్ బియ్యానికి గడువు పెంపు!



**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీ గడువును పౌరసరఫరాల శాఖ ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించింది. వాతావరణంలో ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్.. మూడు నెలలకు సంబంధించిన కోటాను ఒకే విడతలో ఆగస్టు 31 లోపు పంపిణీ చేస్తామని గతంలో ప్రకటించింది. అయితే ఒకేసారి మూడు నెలల సరుకులు ఇవ్వడం వల్ల రేషన్ దుకాణాల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడటం, మరోవైపు రాఖీ పౌర్ణమి పండుగ సెలవుల నేపథ్యంలో పలువురు లబ్ధిదారులు తమ సొంతూళ్లకు వెళ్లడంతో అనుకున్న గడువులోగా పూర్తిస్థాయిలో రేషన్ తీసుకోలేకపోయారు.

ప్రజల ఇబ్బందులను గమనించిన పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు లబ్ధిదారులు ఎవరు నష్ట పడకూడదనే ఉద్దేశంతో పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం వరకు అన్ని రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ యథావిధిగా కొనసాగుతుందని శాఖ స్పష్టం చేసింది. ఇంకా మూడు నెలల కోటాను తీసుకోని అర్హులైన కార్డుదారులు నిర్దేశిత గడువులోగా సమీప రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యాన్ని తీసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# హైదరాబాద్‌లో పోస్టర్ల కలకలం!




**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనను తీవ్రంగా విమర్శిస్తూ హైదరాబాద్‌లోని పలు కీలక ప్రాంతాల్లో వెలసిన వివాదాస్పద పోస్టర్లు తీవ్ర కలకలం రేపాయి. '1000 డేస్ ఆఫ్ కాంగ్రెస్ గవర్నమెంట్' శీర్షికతో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళల్లో ఈ పోస్టర్లను భారీగా అతికించారు. నగరంలోని అత్యంత రద్దీ, కీలక ప్రాంతాలైన రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయం, ట్యాంక్ బండ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ పరిసరాలు, మెట్రో పిల్లర్లు, జూబ్లీహిల్స్, బేగంపేటలతో పాటు అధికార పార్టీ కేంద్ర కార్యాలయమైన గాంధీభవన్ పరిసర ప్రాంతాల్లో కూడా ఈ పోస్టర్లు ప్రత్యక్షమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఈ పోస్టర్లలో 'TGSMS' పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన ఏఐ చిత్రాలను రూపొందించి వ్యంగ్యంగా ముద్రించారు. ఓవైపు రూపాయి నోట్ల కట్టలతో ఉన్న భారీ మూటను సీఎం మోసుకెళ్తున్నట్లు, మరోవైపు ప్రజలు, యువత ఆవేదనతో చేతులెత్తి సహాయం కోసం ఎదురు చూస్తున్నట్లు ఉన్న దృశ్యాలను పోల్చి చూపిస్తూ కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా నగరవ్యాప్తంగా గోడలు, మెట్రో స్తంభాలపై వెలసిన ఈ పోస్టర్లపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, వీటిని ఎవరు ముద్రించి అతికించారనే వివరాలు అందుబాటులోకి రాలేదు. ఇదిలా ఉంటే ఉదయాన్నే ఈ పోస్టర్లను గమనించిన జీహెచ్ఎంసీ సిబ్బంది వాటిని తొలగించే పనిలో పడ్డారు.

# కాళేశ్వరంపై కక్ష.. రైతుపై శిక్ష!



**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ముఖ్యంగా సాగునీటి రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రిటైర్డ్ ఇంజినీర్లు, సర్వీస్‌లో ఉన్న ఇంజినీర్లు కూడా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు, మెస్సీ ఫుట్‌బాల్ కార్యక్రమానికి రూ.100 కోట్లు ఖర్చు చేశారని ప్రస్తావించిన కేటీఆర్.. అందులో కొంత మొత్తాన్ని సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించినా రైతులకు ప్రయోజనం కలిగేదని అన్నారు.

చిన్న కాఫర్ డ్యామ్ నిర్మిస్తే నీటిని లిఫ్ట్ చేయవచ్చని ఇంజినీర్లు సూచించినా ప్రభుత్వం స్పందించడం లేదని కేటీఆర్ విమర్శించారు. నీటి సమస్యలపై ప్రభుత్వానికి లేఖలు రాసిన రిటైర్డ్ ఇంజినీర్లను బెదిరించడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన శ్యామ్ ప్రసాద్ రెడ్డిని అవమానించారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి రంగంలో ఒక్క కొత్త డ్యామ్ లేదా బ్యారేజ్ నిర్మించలేదని కేటీఆర్ విమర్శించారు. ఇప్పటికే నిర్మించిన చెక్‌డ్యామ్‌లను కూడా పేల్చివేస్తున్నారని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనలో సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. పెద్దవాగు ప్రాజెక్టు రెండుసార్లు దెబ్బతిందని, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలడంతో సుమారు రూ.100 కోట్ల నష్టం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటివరకు మృతదేహాలను వెలికితీయలేని పరిస్థితి ఉందని అన్నారు. వట్టెం పంప్‌హౌస్ మునిగిపోయిందని, చెక్‌డ్యామ్‌లు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగిన సమయంలో పెద్ద ఎత్తున హడావుడి చేసిన బీజేపీ.. ఇతర సాగునీటి ప్రాజెక్టుల్లో సమస్యలు ఎదురైనప్పుడు ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. పెద్దవాగు, సుంకిశాల, ఎస్ఎల్‌బీసీ, వట్టెం వంటి ప్రాజెక్టుల విషయంలో కేంద్ర సంస్థలు ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని నిలదీశారు.

తెలంగాణకు రావాల్సిన నీటి విషయంలో ప్రభుత్వం రాజీ పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాలను ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని విమర్శించారు. బనకచర్ల, పోతిరెడ్డిపాడు అంశాలను ప్రస్తావిస్తూ.. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం ఈ విషయంలో ఎందుకు గట్టిగా మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ సమావేశాల్లో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనను బలంగా వినిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనుమతులు తీసుకొచ్చిన ఏడు ప్రాజెక్టులను రద్దు చేయాలని ప్రతిపాదనలు వచ్చినప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించలేదని ఆరోపించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రయోజనాల కంటే ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి సాగునీటి రంగంలో ఆర్.విద్యాసాగర్ రావు వంటి నిపుణులు సలహాలు ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా గతంలో లేఖలు రాసిన అధికారులను సలహాదారులుగా నియమిస్తే రాష్ట్రానికి న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణకు సాగునీటి రంగంలో భవిష్యత్తులో న్యాయం జరగాలంటే ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో సాగునీటి రంగం తీవ్రంగా నష్టపోయిందని ఆరోపిస్తూ.. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆరోగ్యశాఖలో జాబ్స్ జాతర!




**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణ ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు సంబంధించి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. 1:1.25 నిష్పత్తిలో అభ్యర్థులను తదుపరి దశకు షార్ట్‌లిస్ట్ చేసినట్లు బోర్డు వెల్లడించింది. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు సెప్టెంబర్ 16 నుంచి 26వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ వెంగళ్‌రావ్‌నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఈ ప్రక్రియ జరగనుంది.

అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందుకోసం అవసరమైన అసలు సర్టిఫికెట్లతో పాటు ప్రతి సర్టిఫికెట్‌కు రెండు సెట్ల ఫొటోకాపీలు తీసుకురావాలని వీనూ=దీ సూచించింది. ఇక, నిర్ణీత తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాలేని అభ్యర్థులు లేదా అవసరమైన సర్టిఫికెట్లను సమర్పించలేకపోయిన వారి కోసం సెప్టెంబర్ 28వ తేదీని రిజర్వ్ డేగా నిర్ణయించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బోర్డు సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయనున్నట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. దీంతో 1,931 పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకోనుంది.

రెండున్నరేళ్లలో 15 వేలకు పైగా పోస్టుల భర్తీ

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర వైద్య సిబ్బంది పాత్ర కీలకమని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశాఖలో నియామకాలకు ప్రాధాన్యం ఇస్తోంది. గత రెండున్నర సంవత్సరాల్లోనే ఆరోగ్యశాఖలో 15 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు సుమారు 2 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. తాజా 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల నియామకం పూర్తయితే వైద్య, ఆరోగ్య సేవల్లో సిబ్బంది కొరతను కొంతమేర తగ్గించే అవకాశం ఉంది.

# జీఎస్టీ వసూళ్లలో హైదరాబాద్ హవా!

**మొదటి పేజీ తరువాయి**




ఆగస్టులో తెలంగాణ మొత్తం రూ.4,341 కోట్ల జీఎస్టీ ఆదాయం సాధించగా.. అందులో హైదరాబాద్ నుంచే రూ.3,956 కోట్లు సమకూరాయి.

పన్ను చెల్లింపుదారుల సంఖ్యతో పోలిస్తే హైదరాబాద్ నుంచి వస్తున్న ఆదాయం గణనీయంగా అధికంగా ఉండటానికి నగరంలో అధిక విలువ కలిగిన ఆర్థిక కార్యకలాపాలు కేంద్రీకృతమై ఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఐటీ, ఐటీఈఎస్, ఔషధ, రియల్ ఎస్టేట్ రంగాలకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉండటంతో పెద్ద మొత్తంలో పన్ను పరిధిలోకి వచ్చే వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో ఒక్కో నమోదిత పన్ను చెల్లింపుదారుపై సగటు జీఎస్టీ వసూళ్లు సుమారు రూ.98,900గా ఉండగా.. రాష్ట్ర సగటు రూ.74,845గా ఉంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో తెలంగాణ పరోక్ష పన్నుల ఆదాయం కూడా బలమైన వృద్ధిని నమోదు చేసింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జీఎస్టీ, వ్యాట్ కలిపి రూ.36,636 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.31,477 కోట్లతో పోలిస్తే ఇది 16.39 శాతం అధికం. అంటే ఈ ఐదు నెలల్లో అదనంగా రూ.5,159 కోట్ల ఆదాయం సమకూరింది.

ఏప్రిల్–ఆగస్టు 2025లో రూ.17,414 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు.. 2026లో రూ.20,862 కోట్లకు పెరిగాయి. 19.80 శాతం వృద్ధితో రూ.3,448 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. వ్యాట్ వసూళ్లు కూడా రూ.14,063 కోట్ల నుంచి రూ.15,774 కోట్లకు పెరిగి 12.16 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆగస్టులోనూ జీఎస్టీ వసూళ్లు రూ.3,641 కోట్ల నుంచి రూ.4,341 కోట్లకు పెరగగా, వ్యాట్ ఆదాయం రూ.2,712 కోట్ల నుంచి రూ.3,193 కోట్లకు చేరింది. జీఎస్టీ, వ్యాట్ కలిపి నెలవారీ ఆదాయం రూ.7,534 కోట్లకు చేరింది.

# సన్న వడ్లకు రూ.500 బోనస్.. పొంగులేటి కీలక ప్రకటన



**న్యూస్ డెస్క్, 02 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలన అత్యంత విజయవంతమైందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాలను సమతుల్యం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సన్న వడ్ల కొనుగోలుపై క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పంజాబ్‌ను మించి రాష్ట్రంలో వరి దిగుబడి సాధించామని, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినప్పటికీ తెలంగాణ రైతాంగం ఈ రికార్డును నెలకొల్పడం గర్వకారణమని కొనియాడారు.

**అప్పుల బారిన పడేసినా భేషజాలకు పోకుండా సంక్షేమం**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని తమ నెత్తిన పెట్టిందని మంత్రి ఎద్దేవా చేశారు. అయినా సరే, భేషజాలకు పోకుండా గతంలో ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. నిలిచిపోయిన రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులతో పాటు సర్పంచ్‌లకు సంబంధించిన పాత బాకీలను సైతం తమ ప్రభుత్వమే చెల్లించిందని వివరించారు. తెలంగాణలో టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు పారదర్శకంగా ఉద్యోగాలు ఇచ్చామని, ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

**ప్రతిపక్షాల విమర్శలపై ఘాటు స్పందన**

బిఆర్ఎస్, బిజెపి రెండు పార్టీలూ ఒక్కటేనని, అవి బహిరంగంగా జతకట్టినా ప్రజలు ఆమోదించరని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఉపఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ, పట్టణ ప్రాంత ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కే పట్టంగట్టారని గుర్తుచేశారు. బతుకమ్మ చీరల పంపిణీలో గత ప్రభుత్వం అవినీతికి పాల్పడితే, తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి కానుకగా 'పాలపిట్ట చీరల'ను ఆడబిడ్డలకు అందించిందని, త్వరలోనే 'చిలకపచ్చ చీరల'ను పంపిణీ చేయనున్నామని ప్రకటించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని ఆయన స్పష్టం చేశారు.

# కొత్తపేటలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. పలు సేవా కార్యక్రమాలతో సందడి



కొత్తపేట (బిఎన్ఎస్ )సెప్టెంబర్ 02: జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కొత్తపేటలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానుల సమక్షంలో బండారు సంజీవ్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు నిర్వహించారు.

అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరం, కంటి వైద్య శిబిరాల్లో బండారు సంజీవ్ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ఉచిత అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నప్రసాదాన్ని అందించారు.

ఈ సందర్భంగా బండారు సంజీవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించి ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. ప్రజా సేవ, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని అన్నారు.

కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ అందిస్తున్న సహకారాన్ని సంజీవ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. నియోజకవర్గంలో ఎంతో ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రావులపాలెం--వాడపల్లి ఏటిగట్టు రహదారి అభివృద్ధికి సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే నియోజకవర్గంలోని పలు రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

నియోజకవర్గానికి సంబంధించిన ఏ సమస్యనైనా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు, దాని పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని సంజీవ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ సహకారంతో కొత్తపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో జన సేనుడి జన్మదినోత్సవ వేడుకలు




కొత్తపేట (బిఎన్ఎస్ )సెప్టెంబర్ 02: కొత్తపేట బిజెపి మండల యువమోర్చా అధ్యక్షుడు ఆడబాల రమేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారి జన్మదినోత్సవం వానపల్లి లో ఘనంగా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి ఎస్ఐఆర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పాలూరి సత్యానందం విచ్చేసి యువమోర్చా నాయకులు పవన్ కళ్యాణ్ అభిమానులు జనసేన నాయకులు మధ్య కేక్ కటింగ్ చేశారు అనంతరం వానపల్లి పీహెచ్సీ వైద్యశాల నందు రోగులకు పాలు పండ్లు పంచిపెట్టారు ఈ సందర్భంగా పాలూరి సత్యానందం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఒక నిస్వార్ధ ప్రజానాయకుడని, తన వ్యక్తిగత సంపాదన నుండి చాలా మొత్తం పేద ప్రజలకు, రైతులకు, ఆపదలో ఉన్నవారికి సాయంగా ఇచ్చేసారని, అంతేకాకుండా ఈ రాష్ట్రంలో ఒక రాక్షస పాలన అంతమొందించడానికి కేంద్రంలో బిజెపిని రాష్ట్రంలో టిడిపిని తాను మధ్యవర్తిగా ఉండి ఎన్డీఏ కూటమిని నిలబెట్టి అధికారంలోకి తీసుకొచ్చారని కొనియాడారు. అటువంటి నాయకుడు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలూరి జయప్రకాశ్ నారాయణ బిజెపి యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్,యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి చోడపనీడి ముఖేష్, ఎస్సీ మోర్చా నాయకులు బళ్ల మూలాస్వామి,నల్లా వరప్రసాద్, జనసేన నాయకులు దునబోయిన పల్లంరాజు ,వానపల్లి గ్రామ అధ్యక్షులు జనసేన పార్టీ దాసరి ప్రసాద్, వక్కపట్ల చంద్రశేఖర్ బండారు శ్రీనువాసు ,అల్లడి ఆనంద్ ,అల్లడి సతీష్ ,ధరణాల శేఖరు ,వేమన సాయి బాబు. మరియు వైద్య సిబ్బంది అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# బద్వేల్ లో సాంకేతిక పరికరాలతో మోసపూరిత పేకాట, మద్యం ముఠా గుట్టురట్టు.!

## డీఎస్పీ రాజేంద్రప్రసాద్



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 02: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ మోసపూరితంగా జూదం ఆడుతూ, అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచి విక్రయిస్తున్న తొమ్మిది మంది సభ్యుల ముఠాను బద్వేల్ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మైదుకూరు పోలీసు డివిజనల్ అధికారి డీఎస్పీ జి. రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ.. వైఎస్ఆర్. కడపజిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, తమ పర్యవేక్షణలో సెప్టెంబర్ 01 సాయంత్రం 4 గంటలకు వచ్చిన నిఘా సమాచారం ఆధారంగా బద్వేల్ పట్టణ సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు జయరాములు, రంగారావు తమ సిబ్బందితో కలసి దాడి నిర్వహించినట్లు పేర్కొన్నారు. బద్వేల్ పట్టణ పరిధిలోని రామాంజనేయ నగర్, తెలుగు గంగ బాటరీ రోడ్డులోని ఒక ఇంటిలో ఈ అక్రమ దందా సాగుతున్నట్లు గుర్తించామన్నారు.

నిందితులు అంతర్జాలం ద్వారా కొనుగోలు చేసిన ప్రత్యేక విద్యుత్ ఆధారిత స్కాన్ పరికరాలు, బ్లూటూత్ సాధనాలు, డిజిటల్ చెవి పరికరాల ఇయర్ ఫోన్లు, సహాయంతో పేకాటలో ఏ ముక్క వస్తుందో ముందుగానే గుర్తించి మోసపూరితంగా మంగతాయ్ ఆడుతున్నట్లు కనుగొన్నామని డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఈ ఘటనపై బద్వేల్ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు సంఖ్య 144/2026, ఆంధ్రప్రదేశ్ మద్యం సవరణ చట్టం మరియు ఆంధ్రప్రదేశ్ జూద చట్టం కింద కేసు నమోదు చేసి, తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నట్లు మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ వివరించారు..

# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



నల్లగొండ (బిఎన్ఎస్): నల్లగొండ జిల్లా నకిరేకల్లో ఈనెల 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.. సీఎం పర్యటన సందభంగా నకిరేకల్ లో చేపడుతున్న ఏర్పాట్లను నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, ఎస్పీ శరత్చంద్ర పవార్ తో కలిసి విప్ వీరేశం పరిశీలించారు.. నకిరేకల్ లో నూతనం గా నిర్మించిన 100 పడకల ఆస్పత్రి తో పాటు భిరంగ సభ నిర్వహించే మినీ స్టేడియం వద్ద చేపడుతున్న పనులను పర్యవేక్షించారూ.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ.. 5న జరిగే పరి భాగంగా వంద పడకల ప్రభుత్వ

ఆసుపత్రిని సీఎం ప్రారంభిస్తారని. 200కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, ప్రభుత్వ కార్యాల యాల సముదాయం నిర్మాణ పనులకు శంకు స్థాపనలు చేస్తారని వివరించారు. అనంతరం నకిరేకల్ మినీ స్టేడియం లో జరిగే సీఎం సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేస్తున్నామన్నారు. సీఎం రాకతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల్లో మరింత వేగం పెరగనుంద న్నారు.

# ఖర్గేను అవమానించడంపై ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఆగ్రహం

**'శుద్ధీకరణ' చర్యను తీవ్రంగా ఖండించిన ఎంపీలు**

**సెప్టెంబర్ 8న రాష్ట్రపతిని కలవాలని నిర్ణయం**

**సెప్టెంబర్ 7న ఇందిరా భవన్‌లో కార్యాచరణపై భేటీ**

**బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్**

రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కు ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో చోటుచేసుకున్న ఘటనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, సీనియర్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఖర్గే పర్యటన అనంతరం 'శుద్ధీకరణ' చర్యపై ఎస్సీ, ఎస్టీ పార్లమెంట్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన కేవలం ఖర్గేను వ్యక్తిగతంగా అవమానించడమే కాదని, మొత్తం ఎస్సీ, ఎస్టీ సమాజం గౌరవం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా వారు అభివర్ణించారు. సమానత్వం, వ్యక్తిగత గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి రాజ్యాంగ సూత్రాలకు ఇటువంటి చర్యలు విరుద్ధమని పేర్కొన్నారు.ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీ పార్లమెంట్ సభ్యులు బుధవారం న్యూఢిల్లీలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని ఇకపై సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ అంశాన్ని అత్యున్నత రాజ్యాంగ స్థాయికి తీసుకెళ్లి న్యాయం సాధించే వరకు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. నాగర్‌కర్నూల్ (ఎస్సీ) లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ డా. మల్లు రవి కూడా ఈ వ్యవహారంపై రాష్ట్రపతికి లేఖ సమర్పించారు. ఘటనపై తగిన జోక్యం చేసుకుని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూడాలని ఆయన రాష్ట్రపతిని



కోరారు.ఈ సమావేశానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ జార్ఖండ్ ఇన్‌చార్జ్ కె. రాజు, నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ససారం ఎంపీ మనోజ్ కుమార్, తురా ఎంపీ సలెంగ్ ఏ. సంగ్మా, కోరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు.ఫతేగఢ్ సాహిబ్ ఎంపీ అమర్ సింగ్, టోంక్–సవాయ్ మాధోపూర్ ఎంపీ హరీశ్ చంద్ర మీనా, వరంగల్ ఎంపీ కడియం కావ్య, బారాబంకీ ఎంపీ తనూజ్ పునియా తదితరులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

# మైదుకూరులో ఘనంగా వైఎస్సార్ 17 వ వర్ధంతి కార్యక్రమం



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 02: కడపజిల్లా.. మైదుకూరులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ను స్మరించుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తు చేశారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో వైఎస్సార్ పనిచేశారని కొనియాడారు. ముఖ్యంగా రైతుల సంక్షేమానికి వైఎస్సార్ తీసుకున్న నిర్ణయాలు ఎంతో ప్రాధాన్యత గలిగినవి అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ వంటి పథకాలను తీసుకురావడంతో పాటు, విద్య, వ్యవసాయం, సాగునీరు, పేదల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. వైఎస్సార్ మరణించి దాదాపుగా 17 సంవత్సరాలు గడిచినా. ఆయన అందించిన సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని రఘురామిరెడ్డి అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవసాయం దండగ అనే రీతిలో పరిపాలన చేయడం వల్ల రైతులు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబటి సురేష్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.!!

**టీడీపీ నేతల దాడులకు భయపడాల్సిన అవసరం లేదు..**

**మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 02: పులివెందులలోని తన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను అంబటి సురేష్ కుటుంబ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా కమలాపురంలో తనపై జరిగిన దాడి ఘటనకు సంబంధించిన వివరాలను సురేష్ వైయస్ జగన్‌కు వివరించారు. కమలాపురంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి పరిహారం కోరినందుకు టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి అనుచరులు తనను బలవంతంగా తీసుకెళ్లి దాడి చేశారని సురేష్ వివరించారు. ఆటోలో తీసుకెళ్తూ తనపై దాడి చేస్తూ టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లారని సురేష్ చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కమలాపురం ఇన్‌ఛార్జ్ నరేన్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీడీపీ కార్యాలయానికి బయలుదేరడంతో తనను విడిచిపెట్టారని సురేష్ జగన్‌క మోహన్ రెడ్డి కి తెలిపారు. తాను వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నందుకే తనపై కక్షపూరితంగా దాడి చేశారని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సురేష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడిన వైయస్ జగన్ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన సురేష్‌పై జరిగిన దాడి ఘటనపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా సురేష్ కుటుంబానికి వైయస్ జగన్ ధైర్యం చెప్పారు. రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు, దాడులు ఎదురైనా భయపడాల్సిన అవసరం లేదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలు, ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష కార్యకర్తలు, సామాన్య ప్రజలను బెదిరించే ప్రయత్నాలు జరిగితే పార్టీ వారికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు. అంబటి సురేష్ కుటుంబాన్ని వైయస్ జగన్ వద్దకు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, వైయస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నరేన్‌రెడ్డి తీసుకువచ్చి కలిపారు.

# జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా OG' గెటప్‌లో కనిపించిన ప్రభుత్వ అధికారి



ముమ్మిడివరం (బిఎన్ఎస్)సెప్టెంబర్ 02 : బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారి హోదాలో ఉన్న ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్ పి. రవివర్మ రాజకీయ కార్యక్రమంలో పాల్గొనడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో రాజకీయ నాయకులు నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ రవివర్మ పాల్గొని కేక్ కటింగ్ వేడుకల్లో పాల్గొన్నారని వారు ఆరోపించారు. అంతేకాకుండా, కార్యక్రమంలో ఆయన 'OG' గెటప్‌లో కనిపించడం ప్రభుత్వ అధికారి నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తేలా చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవ చేయాల్సిన అధికారి ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా కనిపించే విధంగా బహిరంగ కార్యక్రమంలో పాల్గొనడం సేవా ప్రవర్తనా నియమావళికి విరుద్ధమా అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ అధికారులు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించకుండా నిష్పాక్షికంగా విధులు నిర్వహించాల్సిన బాధ్యత ఉందని, అలాంటి అధికారులు రాజకీయ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటే ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు.మున్సిపల్ కమిషనర్ పి. రవివర్మపై తక్షణమే విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే సస్పెన్షన్ సహా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని వారు జిల్లా కలెక్టర్, పురపాలక శాఖ ఉన్నతాధికారులను కోరారు. ప్రభుత్వ అధికారులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే విధానానికి స్వస్తి పలకాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అయితే, కమిషనర్‌పై వచ్చిన ఆరోపణల వాస్తవ పరిస్థితిని నిర్ధారించేందుకు సంబంధిత కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, అధికారిక వివరాలను పరిశీలించి విచారణ జరపాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

# యూకేలో ఎంబీఏ.. బాసర బ్రిడ్జిపై నుంచి పడి యువకుడి మృతి



నవీపేట,బిఎన్ఎస్: నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కౌల్పూర్ గ్రామానికి చెందిన రమావత్ సాయికిరణ్ (25) గోదావరి నదిలో పడి చనిపోయాడు. యూకేలో ఎంబీఏ చేస్తున్న అతడు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 5న తిరిగి యూకే వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం బాసర ఆలయానికి సాయికిరణ్ వెళ్లాడు. దర్శనం అనంతరం బ్రిడ్జిపై ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు గాలింపు చేపట్టగా బుధవారం అతడి మృతదేహం లభ్యమైంది. తండ్రి రమావత్ భోజారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎస్సీ సెల్ సెక్రెటరీ ఆరుగుల రమణ



రాజమండ్రి (బిఎన్ఎస్)సెప్టెంబర్ 02 :దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ మండలం ఎస్సీ సెల్ సెక్రెటరీ ఆరుగుల రమణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆరుగుల రమణమాట్లాడుతూ.. రాష్ట్రానికి ముఖ్యమంత్రులు ఎంతోమంది వచ్చారు, వెళ్లారు కానీ రైతాంగం, పేదలు, సామాన్య ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని అన్నారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు యూరియా, రైతులకు ఇచ్చిన ఆర్థిక హామీలు, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ వంటి అంశాలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు.రైతులకు సాగునీరు, పేదలకు సంక్షేమం, ప్రజలకు భరోసా కల్పించిన మహానేత వైఎస్సార్‌ను ఆయన వర్ధంతి సందర్భంగా స్మరించుకోవడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల తరపున నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

# రాపూరులో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):-దివంగత నేత,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా రాపూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.స్థానిక గ్రంథాలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాపకన్ను మధురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ... డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఆయన అమలు చేసిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు, పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన కృషి ఎనలేనిదని గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అందించిన సంక్షేమ పాలన ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి, పెంచల్ రెడ్డి,వైస్సార్ కాంగ్రెస్ పార్టీ రాపూరు మండల అధ్యక్షులు బొడ్డు మధుసూదన్ రెడ్డి, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి,డాక్టర్ ఖాదర్ బాషా,ఏటూరు విజయశేఖర్ రెడ్డి, ఏటూరు మురళి మోహన్ రెడ్డి, బండి రత్నకర్ రెడ్డి, పిట్టబోయిన వెంకటసుబ్బయ్య సహా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరంలో పాల్గొన్న నేదురుమల్లి



నెల్లూరు జిల్లా గూడూరు(బిఎన్ఎస్):- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా గూడూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బూదూరు గురవయ్య గారి ఆధ్వర్యంలో గూడూరులోని పివిఆర్ కళ్యాణమండపంలో రక్తదాన శిబిరం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి గారిని, ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి గారు, వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త శ్రీ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య మరియు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతించారు. అనంతరం వైస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేద ప్రజలను అభివృద్ధి పదంలో నడిపించాలనే ఉద్దేశంతో ఎన్నో సంక్షేమ సేవా పథకాలను తీసుకువచ్చారని అన్నారు దానిలో భాగంగానే మాజీ ముఖ్యమంత్రివర్యులు కీర్తిశేషులు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి కల , వైయస్సార్ దీర్ఘ దృష్టితో జలజ్ఞ భాగంగా వాకాడు స్వర్ణముఖి మ్యారేజ్ నిర్మాణం రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రారంభమై వారి చేతుల మీద గానే ప్రారంభించబడిందని అన్నారు. రాజశేఖర్ రెడ్డి గారి అడుగుజాడల్లోనే వారి తనయుడు జగన్మోహన్ రెడ్డి కూడా ఎన్నో అభివృద్ధి పథకాలు పేద ప్రజల కోసం తీసుకువచ్చారని అన్నారు. ఇప్పుడు ఎలక్షన్ పెట్టిన ప్రజలు జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారందరికీ అభినందనలు తెలియజేశారు

# అక్రమంగా మద్యం నిల్వ.. నలుగురిపై కేసులు



నెల్లూరు జిల్లా పొదలకూరు(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పొదలకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అక్రమంగా మద్యం నిల్వ చేసిన వారిపై దాడులు నిర్వహించారు.పొదలకూరు స్టేషన్ పరిధిలో యనమల వెంకటేశ్వర్లు వద్ద 8 మద్యం సీసాలు, షేక్ షానవాజ్ వద్ద 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సైదాపురం మండలంలో కాలగంధి అశోక్ వద్ద 7, శివలంక రత్నమ్మ వద్ద 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా మద్యం కలిగి ఉన్న నలుగురిని అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మొత్తం 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఈ దాడుల్లో పొదలకూరు సీఐ వేంకటేశ్వరరావు, నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐతో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



# కూటమి పాలనలో ఆర్యవైశ్యులపై దాడులు..!!

## కడప మీడియా సమావేశంలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ వెల్లడి.

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 02:

కడప నగరంలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ఆర్య వైశ్యులపై దాడులు జరుగుతున్నాయని, రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. వైకాపా నేత మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తెలియజేస్తూ.. కమలాపురంలో ఆర్య వైష్య సంఘం నేతపై దాడి చేశారన్నారు. పై ఓవర్ నిర్మాణం బాధితుల తరపున ప్రశ్నించిన ఆర్య వైష్యుడిపై స్థానిక ఎమ్మెల్యే పుత్రా అనుచరులు కిడ్నాప్ చేసి ఎమ్మెల్యే కార్యాలయంకు తరలించి చిత్రహింసలకు గురి చేశారన్నారు. ఇదే విషయాన్ని కిడ్నాప్ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జంగిల్ రాజ్యం నడుస్తోందని, నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అలవాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆర్య వైష్యులపై ఎక్కువగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఆర్య వైష్యులపై దాడులు చేసి కూటమి పరిపాలన చేస్తోందని మండిపడ్డారు. స్థానికంగా ఆర్య వైష్య కార్పోరేషన్ అడ్డం పెట్టుకొని డబ్బులు వసూలు దందా కార్యక్రమం చేస్తున్నానన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆర్య వైష్యులకు తిరుమలలో అన్ని దేవాలయాల్లో అవకాశం కల్పించారు. ఆర్య వైష్య లను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని, అలాగే కూటమి ప్రభుత్వంలో ఆర్య వైష్యులు సజావుగా వారి, వారి వ్యాపారాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారందరికీ కూడా మా వైకాపా ప్రభుత్వం అండగా ఉంటుందని, మీడియా ద్వారా ఆర్యవైశ్యులను ఉద్దేశించి తెలియజేశారు.

# ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ కు అన్న, చెల్లెలు నివాళులు





బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 02: వైఎస్సార్ 17 వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. అన్న జగన్, చెల్లి షర్మిల ఇరువురు విరివిరిగా కలిసి కుటుంబ సభ్యులు, ఆయా పార్టీ నేతలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఏపీసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వైయస్ రాజశేఖర రెడ్డి 17 వ వర్ధంతి సందర్భంగా తండ్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి కోట్లాదిమంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, కాబట్టి అటువంటి నాయకుని ఇవాళ కోట్ల మంది ప్రజల గుండెల్లో వైయస్ఆర్ ఎప్పటికీ బ్రతికే ఉంటారన్నారు. అలాగే వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి గుర్తు చేసుకుంటూ తెలుపుతూ.. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అద్భుత పథకాలు అందించిన మహానాయకుడు వైయస్ఆర్ అన్నారు. ప్రజల మదిలో నిలిచిపోయేలా గొప్ప ప్రజా సంక్షేమ పనులు చేసిన నాయకుడు రాజశేఖర రెడ్డి అన్నారు.

# భవిష్యత్తు జనసేన పార్టీదే.!!

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భవిష్యత్ దార్శనికుడు.

## జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 02: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ భవిష్యత్ దార్శనికుడని జనసేన పార్టీ జమ్మలమడుగు నియోజక వర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం జన్మదినాన్ని పురస్కరించుకొని జమ్మలమడుగు జనసేన కో ఆర్డినేటర్ డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో జమ్మలమడుగు జనసేన పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలోని పురవీధుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం స్థానికప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో జనసేనాని పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో జన సైనికులు, యువకులు అధిక సంఖ్యలో రక్తదానం నిర్వహించారు. ఈ రక్తదాన కార్యక్రమంలో నల్లంశెట్టి నాగార్జున తోపాటు దాదావు 100 మందికి పైగా జన సైనికులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున మాట్లాడుతూ.. గతంలో చూడని విధంగా పరిపాలనలో కొత్త దనాన్ని పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు తెలియజేశారన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ప్రతి గ్రామంలో, పట్టణాలలోనూ విస్తృతంగా రోడ్ల నిర్మాణం చేపట్టి గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపు కోవాలని కోరారు. భవిష్యత్ జనసేనదే అన్నారు. రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో అన్ని కేంద్రాల నుంచి జనసేన పార్టీ అభ్యర్థులు పోటీలలో నిలుస్తారని తెలిపారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రఫిక్ బాషా, జన సైనికులు నీలం రమేష్, పవన్ కుమార్, శేఖర్ రెడ్డి, కాటమ రాయుడు, నరసింహ, సన్నీ, విజయ్, వినయ్, విజయ రాజు, సుధాకర్, కిరణ్, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి వైఎస్సార్, స్వామినాథన్ అందించిన సేవలు చిరస్మరణీయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకువచ్చిన ఇద్దరు మహనీయులు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కొనియాడారు. న్యూఢిల్లీలో కేవీపీ వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి మరియు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ రంగానికి శాస్త్ర సాంకేతిక ఫలాలను డాక్టర్ స్వామినాథన్ అందిస్తే... రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందనే భరోసాను డాక్టర్ వైఎస్ఆర్ కల్పించారని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఒకప్పుడు ఆకలి చావులతో అలమటించిన దేశాన్ని హరిత విప్లవంతో ఆహార భద్రత వైపు నడిపించిన ఘనత నాటి ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ దృఢ సంకల్పానికి, ఎం.ఎస్. స్వామినాథన్ లాంటి శాస్త్రవేత్తల కృషికి దక్కుతుందన్నారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్... వ్యవసాయం అంటే కేవలం పంట మాత్రమే కాదని, ఆ పంటను పండించే రైతు కుటుంబం అని గట్టిగా నమ్మానని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు, రుణాలు అందించడంతో పాటు వారి కుటుంబాలకు వైద్యం, విద్యను చేరువ చేసి రైతు సంక్షేమాన్ని తన పాలనలో ప్రధాన భాగంగా మార్చారని గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సైతం విస్మరించలేని విధంగా రైతు సంక్షేమానికి వైఎస్సార్ బాటలు వేశారని ప్రశంసించారు.

తన రాజకీయ ప్రస్థానంలో వైఎస్ఆర్ నాయకత్వంలో చీఫ్ విప్‌గా పనిచేయడం తనకు దక్కిన అరుదైన అవకాశమని భట్టి విక్రమార్క భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. 2009 ఎన్నికల తర్వాత కొత్తగా ఎన్నికైన 74 మంది యువ ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించేందుకు వైఎస్సార్ సూచన మేరకు ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించామని చెప్పారు. ఆ తరగతులకు ప్రతిరోజూ హాజరైన వైఎస్సార్... దేశాన్ని సమైక్యంగా ఉంచుతూ పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సాధించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని యువ ఎమ్మెల్యేలకు ఉద్బోధించారని తెలిపారు. జీవితాంతం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన చేసిన దిశానిర్దేశం ఇప్పటికీ తమకు నిత్య స్ఫూర్తిదాయకమని చెప్పారు.

డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి, డాక్టర్ కె.వి.పి. రామచంద్రరావుల మధ్య ఉన్న స్నేహం ఎందరికో ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుల్బర్గాలో విద్యార్థి దశ నుంచే ప్రారంభమైన వీరి ప్రయాణంలో, అప్పట్లో విద్యార్థి రాజకీయాల్లో ఎదురైన సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు వెళ్లేవారని, ఖర్గే గారు వారికి అండగా నిలబడి మార్గదర్శనం చేశారని గుర్తుచేశారు. మిత్రుడు భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలను సజీవంగా ఉంచేందుకు కె.వి.పి. రామచంద్రరావు 'డాక్టర్ వైఎస్ఆర్ అండ్ డాక్టర్ కెవిపి ఫౌండేషన్' స్థాపించి ఢిల్లీలో ఈ వేడుకను నిర్వహించడం వారి చిరకాల స్నేహానికి నిదర్శనమని కొనియాడారు. గ్రామీణ భారతదేశ అభ్యున్నతికి కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, వైఎస్సార్ ఫౌండేషన్ నిర్వాహకులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# జీడి చంద్రవ్వ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



స్టేషన్ ఘనపూర్ ,బిఎన్ఎస్ సెప్టెంబర్ 02 : స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డుకు చెందిన జీడి చంద్రవ్వ ఇటీవల మృతి చెందడంతో, ఆమె కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర కుమారుడు సింగపురం ఇమ్మానుయేల్ రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ సింగపురం నాగయ్య, జిల్లా కార్యదర్శి చాగంటి మణి , జిల్లా కార్యదర్శి తాడికొండ సంపత్ యాదవ్ , చిల్పూర్ మండల బీసీ సెల్ అధ్యక్షులు బాలరాజు, స్టేషన్ ఘనపూర్ మాజీ ఉపసర్పంచ్ సింగపురం వెంకటయ్య, సీనియర్ నాయకులు లిచింత ఎల్లయ్యలి, మార్కెట్ డైరెక్టర్ వసంత్, జనగామ జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఏలియా తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే రాజశేఖర్, రాజు కుమార్, రాంబాబు, సునీల్, రాజు, సింగపురం ప్రతుష్ తదితర నియోజకవర్గ నాయకులు పాల్గొని జీడి చంద్రవ్వ కుటుంబ సభ్యులను పరామర్శించారు.